
Late shri Annasaheb Dabholkar


Late Shri Dasganu Maharaj


Late Smt. Bayajabai Kote Patil


Late Shri Madhavrao Deshpande




Late Shri Abdul baba


Late Shri Bhaguji Shinde


Late Shri Tatya Patil Kote


Late Shri nanasaheb Chandorkar


Late Shri Mhalsapati


Late Smt.Laxmibai Shinde

# సాయిబాబా స్తవన మంజరి

### ఈ గ్రంథం గురించి....

ఈ సాయినాథ్ " **స్తవన మంజరి** " ని రచించిన దాసగణు మహారాజు బాబాకి అంకిత భక్తుడు.రెండు దశాబ్దాల పాటు సాయిబాబాతో ప్రత్యక్ష సంబంధం కలిగి , దర్శన, స్పర్శన, సంభాషణల ద్వారా సన్నిహితుడై,సంపూర్ణ అనుగ్రహాన్ని పొంది , బాబాకు ఎంతో ప్రీతిపాత్రుడైన భక్తుడు.బాబా లీలల్ని ప్రత్యక్షంగా చవిచూసిన భక్తుడు. మహారాష్ట్రమంతటా తన హరికథల ద్వారా సాయిబాబా మహత్యాన్ని లీలల్ని విరివిగా ప్రచారం చేశాడు.చక్కని మరాఠీ కవనం తో మధుర మనోహర కంఠంతో,గాన నైపుణ్యంతో, భక్తి పారవశ్యంతో,సర్వత్రా సాయిని దర్శించగల మనస్తత్వంతో వేలాది భక్తులను ఆకర్షించి, సామాన్య ప్రజానీకం సైతం సాయి భక్తులై తరించడానికి దోహదం చేసిన దన్యజీవి దాసగణు. సద్భక్తితో సత్యాన్వేషణ చేసి తన్మయుడై,తన భాషా నైపుణ్యం, స్వానుభవంతో సాయిని గానం చేస్తూ మరాఠీలో ఈ స్తవన మంజరిని రచించాడు.

## గమనిక

సాయిబాబా మహా సమాధి : 15-10-1918 మంగళవారం

ఈ స్తవన మంజరి రచన : 09-09-1918 సోమవారం

బాబా సముఖం లో చదివి

బాబాకి అకింతం ఇచ్చినది : 12-09-1918 గురువారం

( బాబా మహా సమాధికి కేవలం 36 రోజుల ముందు ఈ గ్రంధం వ్రాయబడినది)

సాయిపై అసంఖ్యాక స్తోత్ర గ్రంధాలున్నాయి కాని, ఈ స్తవన మంజరి వాటిలో తలమానికం వంటిది.ఎందుకో తెలుసా ? శిరిడి ద్వారకామాయిలో సాయి సమర్థులు ప్రశాంతంగా కూర్చుని ఉన్నప్పుడు , ఆయన సముఖంలో దీనిని గానం చేసి,సాయికి అంకితం ఇచ్చాడు దాసుగణు .సాయిబాబా తన్మయత్వంతో, నిమీలిత నేత్రాలతో, చిరునవ్వు చిందిస్తూ , దీనిని సంపూర్ణంగా శ్రవణం చేసి, తమ ఆమోదాన్ని తెలుపుతూ," **దీనిని నిత్యం పారాయణం చేసేవారు,సర్వ అరిష్టాలు తొలిగి,సుఖ శాంతులతో భోగ భాగ్యాలతో వర్ధిల్లెదరుగాకా** !" అని ఆశీర్వదించారు .అంటే " మహా మహిమాన్విత మైన ఈ "స్తవన మంజరిని" పారాయణం చేసేవారిపై సాయి భగవానుని కృప ప్రసరిస్తుంది. సాయినాధ భగవానులు సత్వరమే వారి ఐహిక,పారమార్ధిక కోరికలన్నీ నెరవేర్చి,అంత్యకాలంలో ఉత్తమ గతులను ప్రసాదిస్తారు.ఈ గ్రంధ పారాయణం వలన మందబుద్దుల బుద్ధి వికసిస్తుంది. అల్పాయుష్కులు శతాయుష్కులవుతారు. నిరుపేదలు కుబేరులవుతారు. సంతానం లేని వారికి సంతానం కలుగుతుంది. రోగులు పూర్ణారోగ్యవంతులౌతారు.సకలచింతలు,భయాలు తొలిగిపోతాయి .కీర్తిమంతులై గౌరవ మర్యాదలు పొందుతారు ". అన్న ఈ స్తోత్ర ఫలశ్రుతిని సాయి ఆమోదించారు. ఈ స్తవన మంజరి నిత్య పారాయణం వలన కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయి.

**సర్వే జనా: సుఖినోభవంతు!**

**సర్వం శ్రీ సాయినాధార్పణం!**

## నిత్య పారాయణ క్రమం

ఈ "**శ్రీ సాయినాధ స్తవన మంజరి**" నిత్యం పారాయణకు ఎలాంటి కఠిన నియమ నిబంధనలు లేవు. సాయి పట్ల సంపూర్ణ విశ్వాసం, బాబా పై భక్తి ప్రేమలే అసలు సిసలైన నియమాలు.ఏ సమయం లోనైనా సరే,పగలుగాని రాత్రిగాని,ప్రశాంతమైన మనసుతో,వీలైనంత ఏకాంత ప్రదేశంలో కూర్చుని సాయిబాబా రూపాన్ని మనసులో ధ్యానించి పారాయణం చేయవచ్చు.

1.ఈ స్తవనమంజరిని నిత్యం పారాయణం చేసే వారి కష్టాలూ తొలిగిపోతాయి .
2.నిత్య పారాయణంకి అవకాసం లేకపోతే ,కనీసం ప్రతి గురువారం పటించినప్పటికీ సత్ఫలితాలు కలుగుతాయి.
3.అందుకు కూడా అవకాసం లేనివారు,కనీసం ప్రతి ఏకాదశినాడు పారాయణం చేసినప్పటికీ కోరికలు తీరి అద్భుతమైన ఫలితాలను నిస్సందేహంగా పొందుతారు .
అని ఫలశ్రుతిలో రచయిత వివరించినప్పుడు,అది వింటూ బాబా ఆమోదసూచికగా తల ఊపారు.దీని పారాయణం "**సూక్షంలో మోక్షం**".

### అంజలి

### శ్రీ గణేసాయ నమః

జగదాధారా! సర్వసాక్షి !ఓ పార్వతీనందనా !మయూరేశ్వరా! లంబోదరా ! ఊహాతీతా! ఓ గణపతీ! పాహిమాం.నీవు సకల గణాధిపతివి .అందుకీ గణేశుడుగా ప్రసిద్ధి చెందావు. సకలశాస్త్రాలు నిన్ను కీర్తిస్తున్నాయి.ఓ మంగళస్వరూపా! ఫాలచంద్రా ! నన్ను రక్షించు.
ఓ సరస్వతి ! వాగ్విలసినీ! నీ ప్రభావంవల్లనే పలుకులు ప్రభావమందుతాయీ.నీ అస్తిత్వంవల్లనే లోకవ్యవహారాలన్ని జరుగుతాయీ.గ్రంధకర్తలందరికి నీవే ఆరాధ్య దేవతవు. నీవు శబ్దసృష్టికి రాణివి. నీవు ఈ జగతికే అలంకార భూషణం.
నీవు ఊహాతీతమైన మహాసక్తివి,ఓ జగన్మాతా ! వాగ్దేవి ! నీకు వందనం.

## దేవతా స్తుతి

ఓ పండరీనాధా! పాండురంగా ! పూర్ణ పరబ్రహ్మా ! సాధు జన ప్రియా ! సగుణస్వరూపా ! దయాసాగరా! నరహరీ ! పరమ దయామయా!నన్ను రక్షించు.ఓ జగన్నాటక సూత్రధారీ ! రుక్మిణీవల్లభా ! సర్వ జగద్వ్యాపక ! శాస్త్రాలన్నీ నీ స్వరూపాన్నే వర్ని స్తున్నాయి. ఓ చక్రపాణి ! పుస్తకజ్ఞానులకు నీవు అంతుపట్టవు.గ్రంధాలు పఠించినంత మాత్రానా విజ్ఞులవుతారా ! ఆ మూర్ఖపండిత శిఖామణులు పాండితీ గర్వంతో డంభాలు పలుకుతూ,కేవలం వాదాలకే పరిమితమై , ఆ శాస్త్ర చర్చల్లోనే మునిగి తేలుతుంటారు. కేవలం సాధు సత్పురుషులు మాత్రమే నిన్ను తెలుసుకోనగలుగుతారు. మాయా మోహితులైన మిగిలిన జనావళికి అది అసాధ్యం. ఓ దేవా! నీకిదే సాష్టాంగ దండ ప్రణామములు.సాదరంగా స్వీకరించి నన్ను రక్షించు.ఓ పంచవదనా ! శంకరా !కపాలమాలాభరణా ! నీలకంఠ ! దిగంబరా! ఓ పసుపతీ ! ఓంకార స్వరూపా ! నీకు నమస్కారం.నీ నామస్మరణ మాత్రాన దైన్యం నశిస్తుంది.ఓ ధూర్జటి,ఏమి నీ నామ మహిమ ! ఓ నీలకంఠ నీ చరనాంభుజాలకు నమస్కరించి ఈ స్తోత్రాన్ని (స్తవన మంజరిని ) వ్రాయబూనితిని . ఓ పరమేశ్వరా !
సదా నీ సంపూర్ణ సహాయానందించి నన్ను సఫలీకృతున్ని చెయ్యి.ఆత్రనందనా ! దత్తాత్రేయా ! నీకు వందనం.మా కులదేవత శ్రీ మనలక్ష్మికి ప్రణతులు.సాధు సత్పురుషులకు,ఇతర భక్త వరేన్యులకు నా నమస్కృతులు.

శ్రీ సాయినాధా ప్రభూ! మీకు జయం,దిగ్విజయం.పతితపావనా ! దయామయా !నీ పాద పద్మాలపై నా శిరస్సునుంచాను. ఆశ్రితమందారా ! అభాయప్రదాతా ! నన్ను భయాలనుండి రక్షించు.ఓ సాయినాధా! సౌఖ్యధామ నిలయమైన పూర్ణ పరబ్రహ్మ మీరే! పురుషోత్తముడైన శ్రీ మహావిష్ణువు,మధనాంతకుడైన ఉమాపతి శంకరుడు కూడా మీరే! నీవు నరరూపు దాల్చిన పరమేస్వరుడవు.జ్ఞానాకాశంలో ప్రకాశించే భాస్కరుడవు. కరుణాసాగారుడవు. భవరోగాలకు ఔషధం వంటివాడవు.నీవు దీనుల,హీనుల పాలిట చింతామణివి. భక్తజనులను పునీతులను చేసే పావన గంగానదీమ తల్లివి.

సంసారసాగరంలో మునిగి దారి కానని వారిని దరి చేర్చే 'నౌక'వు. ఈ జగతిలో భయార్తులకు నీవే ఆశ్రయం.ఈ జగత్తుకే మూల కారకుడవు.శుద్ధ చైతన్య స్వరూపుడవు.ఓ కరుణాసాంద్రా ! ఈ ప్రపంచమంతా నీ లీలా విలసమే కదా!

## ఆత్మ - జీవులు

జననమరణాలు అజ్ఞాన భావ జనితాలు .అవి కేవలం భ్రాంతి మాత్రమే.ఎంతో పరిశోధించి సంపూర్ణ జ్ఞానులు గ్రహించిన సత్యమిది.అట్టి అజ్ఞాన తిమిరాన్ని నశింపజేసే మీకు జనన మరణాలు లేవు.సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపుడవైన నీవు వాటికతీతుడవే కాదు,నిజానికి వాటిని శాసించే మహారాజువు కూడా ! (కేవలం సృష్టి దర్మనుసారంగా మాత్రమే సాయి తన భౌతిక దేహాన్ని త్యజించారు.శుద్ధ చైతన్య స్వరూపుడైన శ్రీ సాయికి జనన మరణాలెందుకుంటాయి ? అందుకే " **సమాధి నుండి నా మానుష శరీరం మాట్లాడును** " అని అభయ మిచ్చారు బాబా)

'జలకుండం 'లో, కనిపించే నీరు అక్కడే పుట్టి నట్లా ? కాదు కదా ! అది పూర్వం ఏనాటినుండో భూగర్భంలోనున్న జల నిక్షిప్తం నుండి ఇప్పుడు పైకి ఉబికి వచ్చిన ఊటనీరు మాత్రమే.పల్లపు ప్రదేశంలో నీరు ఊరితే దానిని 'కుండము' అని అంటాం.ఆ నీరే లేకపోతే దానిని 'గుంట' అనంటాం.నీరు నిండడం ,ఇంకడం అనే స్థితులు నీటికి సంబంధించినవి కావు.అవి కేవలం 'కుండము'నకు మాత్రమే చెందినవి.'కుండము'లో ఉండే నీరు తన మహత్యాన్ని ఎప్పుడూ ఆ కుండానికివ్వదు ( జననమరణాలు తనువుకే గాని ఆత్మకేప్పుడూ అన్వయించవు ).నీటితో నిండుగా ఉంది కళ కళలాడుతూ ఉన్నపుడు 'కుండము' గర్విస్తుంది.కాని,ఆ నీరే ఇంకిపోతే దీనావస్థకు చేరుకుంటుంది.ఈ మానవ దేహమే ఒక 'కుండము'.అందులోని నిర్మలమైన నీరే శుద్ధ చైతన్యం (జీవాత్మ).కుండములు అనేకం.కాని 'జలం' ఒక్కటే. ఓ సాయిదేవా ! దయామయా ! నీవు 'అనాది'వి.జనన మరణాల కతీతుడవు.నీవే వజ్రాయుధమై నాలోని అజ్ఞాన పర్వతాన్ని ఛేధించి సమూలంగా నాశనమొనరించు (జ్ఞానోదయాన్ని కలిగించు).ఇంతవరకు ఈ భూమండలంపై ఎన్నో కుండములు (జీవులు) జనించాయా

.ఇక ముందు కూడా ఉద్భవిస్తాయి.అట్టి ప్రతి ఒక్క కుండానికి (జీవికి) ఒక్కొక ప్రత్యేకమైన నామరూపాలు ఉంటాయి.కల్పాంతరం వరకూ అవి అలా పిలువబడుతూ, గుర్తించబడుతూ ఉంటాయి.నిఖిల జగతిలోని సమస్త జీవులయందు విరాజమానమై ఉన్నది ఒకే 'చైతన్య శక్తి '.అనగా సకల జీవులయందున్నది ఒకే 'ఆత్మ'.అందుకే 'నీవు-నేను' అనే తారతమ్య భావం ఉచితం కాదు.అణువణువులోనూ వ్యాపించి ఉన్న ఒకే చైతన్య వస్తువు 'నీవు-నేను' అనే ద్వైత భావంతో చూడడం ఎంతమాత్రం సరికాదు. మేఘాలన్నిటి నుండి వర్షింపబడే నీరంతా ఒక్కటే! కాని, ఆ నీరు భూమిపై పడగానే అనేక రకాల రూపాలు పొందుతుంది ( నదీ నదములు, సరస్సులు, బావులు, ఊటాబావులు,కాలువలు వగైరా).

గోదావరి నదీగర్భంలో చేరిన నీరు గోదావరిగా పిలువబడుతూ,పవిత్రంగా భావించబడి పూజలందుకుంటుంది.కాని,బావుల్లో,గుంటల్లో చేరిన నీరుకి అంతటి విలువ ఉండదు. ఓ సాయి పరమాత్మా! నీవు అమర గోదావరి ప్రవాహం.మేము అల్పమైన వాపీ కూపతటాకాల్లాంటి వాళ్ళం.మీకూ మాకూ మధ్య అదే తారతమ్యం.ఓ సాయి గురువరా ! మా జీవితాలు సార్థకం చేసుకోవడం కోసం మీకు సర్వవేళలా శరణాగతులమై మీదరి చేరాం. ఓ పవిత్రమూర్తీ ! మమ్ము సదా రక్షించు.గోదావరి నదీజలాలకంతటి పవిత్రత ఆ 'గోదావరి నదీగర్భం' వల్ల మాత్రమే! అంతే కాని , జలానికి ప్రత్యేకమైన విశిష్టతంటూ ఏమీ లేదు.ఏ నీరైనా ఒక్కటే! నిజానికి గోదావరి గర్భం వల్లనే ఆ నది ప్రవహించే ప్రదేశమంతా పవిత్రతను సంతరించుకుంది.పరిశీలించి చూడగా అట్టి పవిత్రతను చేకూర్చే విశిష్ట గుణం ఆ భూభాగంలోని మట్టిదే! మేఘాల నుండి కురిసిన నీరు ఎక్కడి నేలపైబడి ఎట్టి మార్పూ చెందకుండా ( కల్మష పూరితం కాకుండా) ఉంటుందో ఆ భూభాగాన్ని పండితులు '**పవిత్ర గోదావరి**' అని వ్యవహరిస్తారు.మేఘాలలోని జలం మొదట మధురంగా ఉంటుంది.కాని అది ఇతర ప్రదేశాలలో కురవగానే అక్కడి నేలయొక్క సహజ గుణాల వల్ల వ్యాధి కారకము,ఉప్పు,చేదులాంటి అవగుణాలను గ్రహిస్తుంది.

ఓ సద్గురురాయా ! మీలాగా కామక్రోధలోబాది అరిషడ్వర్గాలా కల్మషాలు అంటని పవిత్ర మూర్తులకు 'సత్పురుషులు' అన్న నామం శోభిస్తుంది.కనుక సత్పురుషులందరూ

పవిత్ర 'గోదావరి నది' లాంటివాళ్ళు.ఓ సాయిదేవా ! మీరు వాళ్ళందరిలో అత్యున్నత స్థానాన్ని అలంకరించారు.సృష్ట్యాది నుండి గోదావరి నది ఉంది.ఆనాటి నుండి నేటి వరకూ లోటు లేకుండా నిండుగా ప్రవహిస్తూనే ఉంది.( నీరు మారుతున్నాను,ఎప్పుడూ నిండుగా ఉండే గోదావరి ప్రవాహంలా జీవులను పాపపంకిలం నుంచి ఉద్ధరించే నిమితం సత్పురుష పరంపర అవతరిస్తునే ఉంటుంది.శ్రీ సాయి నేటికి సజీవుడే! మహా సమాధి అనంతరం కూడా సాయిబాబా తమ భక్తులు పిలిస్తే పలుకుతున్నారు). ఎప్పుడో త్రేతాయుగం లో శ్రీరామచంద్రుడు పవిత్ర గోదావరితీరాన్ని దర్శించాడు.అప్పుడున్న నీరు ఇప్పుడు ఉందా? ఏనాడో సాగరగర్భం లో కలిసిపోయుంటుంది .అప్పటి నీరు వాలుగా ప్రవహించి సాగరం లో కలిసిపోయినప్పటికీ ,ఆనాటి నుండి ఈనాటి వరకు గోదావరి నదీగర్భానికి,దానిలోని నీటికీ ఉండే పవిత్రత చెక్కు చెదరకుండా అలాగే ఉంది.ఏటేటా పాత నీరు పోయి నదిలోకి కొత్త నీరు వస్తుంటుంది. ఓ సాయి పరమాత్మా! మీపట్ల కూడా ఇదే న్యాయం వర్తిస్తుంది .(సత్పురుషులందరికి కూడా ఈ సిద్ధాంతం అన్వయిస్తుంది ).

## గోదావరి తీరంలోని సత్పురుషులు

నూరు సంవత్సరాలు కలిస్తే ఒక శతాబ్దం అవుతుంది.అలాగే సత్పురుషులు సాధు జనులకన్న నూరు రెట్లు అధిక తేజస్వులు.వీరు నదిమధ్యలోని మహాప్రవాహం లాంటి వాళ్ళు.ఇతర సాధు జనులందరూ నదిలోని చిన్న చిన్న అలలలాంటి వాళ్ళు.ఈ పవిత్ర గోదావరిలో మొట్టమొదటి ప్రవాహరూపంలో వచ్చిన సత్పురుషులు - సనక నందనులు, సనత్కుమారుడు మొదలైనవాళ్ళు.ఇది నిస్సంశయం.ఆ తర్వాత నారదుడు,తుంబురుడు,ధృవుడు,ప్రహ్లాదుడు, బలి చక్రవర్తి, శబరి, అంగదుడు, ఆంజనేయుడు, విదురుడు, గోప గోపికలు మొదలైన వాళ్ళు ప్రభవించారు.ఇలా పూర్వకాలంనుంచీ ఈనాటివరకు గడచిన ప్రతి శతాబ్దంలోనూ వచ్చిన ఎన్నో వరద ప్రవాహాల్లాంటి సత్పురుష పరంపరను వివరించగల శక్తి నాకు లేదు.ఓ సాయినాధా ! అదే ఒరవడిలో ఈ శతాబ్దంలో గోదావరిలో ఉప్పెనలా మీరు అవతరించారు. ఇది యదార్ధం.

**శరణాగతి**

ఓ సాయి సమర్ధ! అందుకే సకల కిల్బిషాలు నిర్మూలించగల నీ దివ్య చరణారవిందాలను ఆశ్రయించాను.దేవా ! నా అవగుణాలు పరిగణించి నిరాదరించకా దయతో నన్ను కాపాడు.ఓ దయాఘనా ! సాయిదేవా ! నేను దీనుణ్ణి, హీనుణ్ణి, అజ్ఞానిని, మహాపాపిని, దుష్కర్మాసక్తుణ్ణి , సకల దుర్గుణాలు ఉన్నవాణ్ణి అయినప్పటికీ నన్నుపేక్షించకు. దీనబంధూ! గ్రామగ్రామాల నుంచీ వచ్చి తనలో కలిసే మురికి కాలువలను గోదావరినది తిరస్కరిస్తుందా ?? పరశువేది ఇనుములోని దోషాలను పరిగణిస్తుందా! ఓ అనాధనాధా ! నీవు పరశువేదివి.నేను పాపాత్ముడనని నన్ను విడువకు . నీ దరి చేర్చుకో. నాలో ఎన్నో కల్మషాలున్నాయి.ఓ పతితపావనా! నీ కరుణా కటాక్ష వీక్షణాలు నాపై ప్రసరించి వాటిని తక్షణమే సమూలంగా నిర్మూలించు.ఇదే ఈ దాసుని విన్నపం.ఓ సాయిగురువరా ! పరశువేది తాకిన తరువాత కూడా ఇనుము బంగారంగా మారకుండా ఇనుముగానే మిగిలిపోతే ఆ లోపం దేనిది? పరశువేదిది కాదా ! అందుచేత నాలో పరివర్తన కలగకపోతే ఆ లోపం ఎవరిది? ( కనుక మాలోని మాలిన్యాలను పోగొట్టి మమ్ములనుద్ధరించు ).బాబా! దీనబంధూ! నా భాగ్య ప్రధాత మీరే.నన్ను పాప విముక్తుణ్ణి చెయ్యండి.నన్ను పవిత్రుడిగా చెయ్యలేదన్న అపకీర్తి మీకు రాకూడదు.మీరు పరశువేది - నేను ఇనుప ముక్క లాంటివాణ్ణి.అందుచేత అది మీ బాధ్యత కూడా.సాయిమాతా! బిడ్డలు తప్పు చెయ్యడం సహజమే.కాని తల్లి కోపగించుకుంటుందా? వాళ్ళను లాలించి ప్రేమగా చేరదీయదా?అదేవిధంగా నన్ను కరుణించు.నాపై కోపించకు.

ఓ సమర్ధ సద్గురూ! మీరు మా కోరికలు తీర్చే కల్పతరువు.ఈ భవసాగరాన్ని దాటించే 'నావ' మీరే.ఏ సందేహం లేదు.ఓ సాయినాధా ! నీవే కామధేనువు ! నీవే జ్ఞానాకాశంలో ప్రకాశించే భాస్కరుడవు.నీవే సద్గుణాల నిధి స్వర్గధామం చేర్చే సోపానం కూడా నీవే. ఓ పరమపావనా ! పుణ్యపురుష ! ఓ శాంతస్వరూపా! ఆనంద నిలయా ! చిత్స్వరూపా ! పూర్ణావతారా ! బేధవర్జితా ! జ్ఞానసింధూ ! వందనం.ఓ విజ్ఞానమూర్తీ ! పురుషోత్తమా !

క్షమా,శాంతి నిలయమా ! భక్త లోక విశ్రాంతి ధమమా ! మమ్ములను అనుగ్రహించండి.మీ కృప మాపై వర్షించండి.

## విశిష్టావతారుడు సాయి

ఓ సాయినాధా ! సకల సద్గురు స్వరూపా! సద్గుర మచ్చీంద్రనాధుడు మీరే.మహాత్ముడైన జాలందరుడు,నివృత్తినాధుడు, జ్ఞానేశ్వరుడు, భక్త కబీరు, గోండానివాసి శ్రీ షేక్ మొహమ్మద్, ఏకనాధ మహారాజ్ కూడా మీరే. ఓ సమర్ధ సద్గురూ ! ధావణ్ గాం నివాసి మాణ్ కోజీ బోధ్ లా, సావంత మాలి , సమర్ధ రామదాసు , భక్త తుకారాం, సఖారాం మహరాజ్, మాణిక్య ప్రభువు కూడా మీరే.
ఓ సాయినాధా ! మీరు సకల సద్గురు స్వరూపులు.

బాబా! మీ అవతారలక్ష్యం అనూహ్యం.మీ కులగోత్రాలు అతి రహస్యం.మీ చరిత్ర అగోచరం (అయోనిసంభావుల జీవిత రహస్యాలు నిగూడం). ఓ సాయికృష్ణా! నిన్ను కొందరు మొహమ్మదియుడంటారు.మరికొందరు బ్రాహ్మణుడవంటారు.కాని, నీ నిజస్థితి ఎవరికెరుకా? ఆహా ! శ్రీ కృష్ణుడిలా పరమాద్భుత లీలలు ప్రదర్శిస్తూనే ఉన్నావు. ఆనాడు శ్రీ కృష్ణుని గూర్చి కూడా ప్రజలు పలువిధాలుగా భావించారు.కొందరు యదుకులభూషణుడని కీర్తిస్తే, మరి కొందరు పశుల కాపరి అని హేళన చేశారు. శ్రీ కృష్ణుడు యశోదకు సుకుమార బాలుడు.కంసునిపాలిట కాలయముడు.ఉద్ధవునికి ఆప్తమిత్రుడు.అర్జునుడికి పూర్ణజ్ఞాని.ఓ గురురాయా ! అలాగే జనులు నీ గురించి కూడా ఎవరిమనోభావాల్ని బట్టి వాళ్ళు భావిస్తున్నారు.అందుకు తగినట్లుగానే ఫలం పొందుతున్నారు . మీరుండేది మసీదులో.! మీ చెవులకు కుట్లు లేవు.నైవేద్యం సమర్పించేటప్పుడు తరచూ ఫాతిహా చదువుతుంటారు.ఇవన్ని చూసి కొందరు మిమ్మలిని మొహమ్మదియుడన్నారు.ఓ కారుణ్యమూర్తీ ! మీరు నిరతాగ్నిహోత్రి . నిరంతరం ధుని వెలిగించి ఉంచుతారు.మీ అగ్నిహోత్రారాధన చూసి మిమ్మలిని హిందువుగా భావించడం సహజమే కదా !

కాని సాయిప్రభు! ఇట్టి జాతి భేదాల భ్రాంతులు శుష్కవివాదాలలో,తర్క వితర్క మాయాజాలంలో  మునిగితేలే తార్కికులకు మాత్రమే.కాని నిజమైన భక్తులు,భావ జిజ్ఞాసువులు  మాత్రం వీటికి ప్రాముఖ్యత ఇవ్వరు.వారు ఇలాంటి మాయా జలం లో చిక్కుకోరు.ఓ సద్గురు సార్వభౌమా!  నిజానికి మీరు పరబ్రహ్మస్థితి. ఈ జాతి మతాలకు మీరు అతీతులు.మహోన్నతుడవైన  జగద్గురు మూర్తివి.ఈ జగత్కర్తలు మీరే.బాబా! హిందూ ముస్లింల పరస్పర స్పర్థలను రూపుమాపి,సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని, పెంపొందించడానికి  మసీదులో నిరంతరం ధుని వెలిగించి,అగ్నిహోత్రారాధన   చేస్తూ అపూర్వ లీలావిలాసాన్ని ప్రదర్శించావు.భక్తులకు ఏకత్వాన్ని చాటి చెప్పావు.సాయీశా ! నీవు కులగోత్రాలకతీతుడవు.సత్యస్వరూపివి.నీవు మా ఊహలకందని అవతారమూర్తివి. ఓ సాయి పరమాత్మా ! తర్కవితర్కాలనే జోడు గుర్రాల మీద స్వారి చేస్తూ ఊహాతీతుడవైన నిన్ను చేరగలమా! తార్కికులకు అంతుపట్టని మీ తత్వాన్ని వాక్కులతో ప్రకటించడం సాధ్యమా! అటువంటప్పుడు నా మాటలు నిలువ గలవా! ( అందుకే కేవలం సంపూర్ణ భక్తీ విశ్వాసాలే సాధనాలు ).

## ప్రశంస

ఓ తేజః స్వారూప! మీ సన్నిధిలో భావపరంపర పెల్లుబుకి రాగా,మౌనంగా ఉండలేక పలుకుతున్నాను.స్తుతించడానికి వ్యవహార సరళిలో సాహిత్యంలోని పలుకులే సాధనాలు కదా! అందుచేత నిన్ను కీర్తించే ఈ పదజాలమే పవిత్ర స్తుతి సాహిత్యమై చిరస్థాయిగా  నిలుచుగాకా! అందుచేత మీ అనుగ్రహంవల్ల లభించిన కవితాశక్తితో నా శక్తి కొలది మిమ్మల్ని సదా కీర్తిస్తూనే ఉంటాను.

సత్పురుషులు ఎంతో ఉన్నతులు.వారు దేవతలకంటే  శ్రేష్టులు.ఎందుకంటే వారికి నాది నీది అనే బేధభావం ఉండదు. వారు ఆశ్రితులయెడల ఎలాంటి తారతమ్యం  చూపించక కరుణరసం కురిపిస్తారు.హిరణ్యకశిపుడు,రావణాసురుడు మొదలైనవాళ్ళు దేవతలను ద్వేషించారు.అందుకే వారిచేత సంహరింపబడ్డారు.కాని సత్పురుషుల చేతిలో అలా హాని పొందిన  వారొక్కరు లేరు.గోపీచంద్ మహారాజు జాలందర మునీశ్వరుణ్ణి పేడకుప్పలో

పాతిపెట్టాడు.కాని, ఆ మహాత్ముడు అతడి దుష్కార్యానికి ఏ మాత్రం వ్యధ చెందలేదు.పైగా ఆ మూర్ఖుడైన గోపీచంద్ మహారాజుకు ఆ దోషం అంటకుండా కాపాడి,అతణ్ణి ఉద్దరించాడు.అంతే కాదు,అతనికి అమరత్వాన్ని కూడా ప్రసాదించాడు. ఇట్టి సాదు సత్పురుషుల ఔన్నత్యాన్ని వర్ణించనేవరితరం? సాధు సత్పురుషులు సూర్యనారాయణుడి లాంటివారు.వారి కృప జ్ఞానప్రకాశం.వారు అమిత సుఖప్రదాత అయిన చంద్రుడులాంటివారు.వారి కృప చల్లని వెన్నెలలా ఆహ్లాదభరితం.సాధు సత్పురుషులు పరిమళ భరితమైన కస్తూరి,రసపూర్ణమైన చెరుకువంటివారు.వారి అవ్యాజ కరుణ ,సుగంధంలా పరిమళిస్తుంది.వారి కృప మధుర రసపూరితం.వారు దుష్టుల యందు శిష్టుల యందు కూడ సమబుద్ధి కలిగి ఉంటారు. అంతేకాదు, పాపాత్ములపై మరింత దయ కలిగి ఉండడం వారి సహజ గుణం.

## పాపప్రక్షాళన

ఎలాగంటే మలినవస్త్రాలే శుభ్రం కావడానికి గోదావరి వద్దకొస్తాయి.కాని శుభ్రమైన బట్టలకు ఆ అవసరం ఉండదు.అవి గోదావరికి దూరంగా పెట్టెలోనే ఉంటాయి.ఐతే.. ఆ పెట్టెలోనున్న పరిశుభ్రమైన బట్టలు కూడా పూర్వకాలం లో ఒకనాడు మురికివే. ఒకప్పుడు గోదావరి వద్దకొచ్చి శుభ్రపడి పెట్టెలోనికి చేరినవే.

ఓ సాయి సమర్థా! పతిత పావనా! ఆపెటికే ' వైకుంఠము '. మీరే పవిత్ర 'గోదావరి'.మీయందు అచంచల విశ్వాసమే 'స్నానఘట్టం'.జీవులే 'వస్త్రాలు'. అరిషడ్వర్గాలే 'మాలిన్యాలు'. అనగా మీ యందు విశ్వాసం అనే స్నాన ఘట్టం లో జీవాత్మలనెడు వస్త్రాలు షడ్వికారాలనే మాలిన్యాలను తొలగించుకుంటాయి.ఓ సాయి సమర్థా! మీ పాద పంకజ దర్శనమే మాకూ పవిత్ర 'గోదావరి స్నానం'. కరుణా కటాక్ష వీక్షణాలు మాపై ప్రసరింపజేసి,పాప ప్రక్షాళన గావించి,మమ్మల్ని పునీతులను చేయగల సమర్థులు మీరే! పరమ పావనమూర్తీ! మేము సామాన్య మానవులం.ఇహలోక వాసనలకు లోబడి, మేము చేసే పనులవల్ల తరచూ పాపాలను (మురికిని) పొందుతుంటాం .అందుచేత అవి పోగొట్టుకోవడానికి మీలాంటి ఉత్తమ

సాధుసత్పురుషులను తరచుగా సందర్శించడానికి మేమే తగినవాళ్ళం.గోదావరినదిలో నీరు పుష్కలంగా ఉన్నప్పుడు శుభ్రపడడం కోసం మురికిబట్టలు వస్తాయి.అవి శుభ్రపడకుండా అక్కడి స్నానఘట్టాలపై మురికి బట్టలగానే మిగిలిపోతే ఆ అప్రతిష్ట గోదావరికే కదా!

## సమాశ్రయము

ఓ సద్గురుమౌళీ ! మీరు ఏపుగా పెరిగి చల్లటి నీడ నిచ్చే మహావృక్షము వంటివారు.మేము తీవ్ర తాపత్ర యాగ్నితో బాధపడుతూ మీ నీడలో సేదదీరాలని ఆరాటపడే బాటసారులం.ఓ గురుసార్వభౌమా ! కరుణావరుణాలయా ! సర్వోత్కృష్టమైన మీ సత్కృపయనెడి చల్లని నీడలో మమ్మల్ని సేదదీర్చి ఆ వేడినుండి రక్షించండి.ప్రభూ! నీడ కోసం ఒక వృక్షం క్రింద కూర్చున్నప్పుడు ఇంకా పైనుండి ఎండ వేడి తగులుతుంటే , దాన్ని నీడనిచ్చే వృక్షమని ఎవరంటారు?? భక్త మందారా! మహావృక్షం వంటి మిమ్మల్ని మేము ఆశ్రయించాం.ఇంకా తాపత్రయాగ్ని మమ్మల్ని బాధిస్తుంటే నిన్ను ఆశ్రిత మందారమని ఎవరంటారు ?

ఓ సాయీ! ఈ లోకంలో మీ కృప లేకుండా జనావళికి మేలు జరగడం అసాధ్యం. ఓ శేషసాయీ ! కృష్ణ భగవానుని అనుగ్రహం వల్లనే గదా కురుక్షేత్రంలో అర్జునుడు ధర్మమార్గామెరిగి ధన్యుడయ్యాడు ! స్నేహశీలియైన సుగ్రీవుడు సహాయంతో విభీషణుడు శ్రీరామచంద్రుని దివ్య సన్నిధిని పొందగలిగాడు .అతడి ద్వారానే రామ విభీషణుల మైత్రీబంధం పెంపొందింది .ఆ శ్రీహరి మహిమలు సత్పురుషుల కారణంగానే విశ్వవిఖ్యాతమయ్యాయి.

వేదాలుకూడ నిర్గుణ పరబ్రహ్మను సంపూర్ణంగా వర్ణించలేకపోయాయి .అందుచేత అవ్యక్తమైన నిర్గుణ బ్రహ్మత్వమును ఊహించి ఉపాసించడం సామాన్యులకు సాధ్యం కాదు.అందుకే ఋషులు 'సగుణోపాసన ' అనే సాధనాన్ని భూలోకంలో ప్రచారం చేశారు.సగుణ సాకార రూపంలో ఆ పరబ్రహ్మను అవతరింపజేశారు. వైకుంఠాధిపతి, రుక్మిణీ వల్లభుడు అయిన శ్రీ కృష్ణుణ్ణి దామాజీ అంటరానివాడుగా మార్చాడు.

ఆ జగన్నాధుడే భక్త చోఖామేళా కోసం పశువుల కళేబరాలు  మోసాడు.సాధు సత్పురుషుల అసమాన శక్తి సమర్ధ్యాలకు లోబడి ఆ జగన్నాధుడైన శ్రీహరి నీటి కడవలను మోసి వారికి సేవలందించాడు. ( సక్కుబాయి భక్తికి మెచ్చి శ్రీ కృష్ణుడు, ఏకనాథ్ మహరాజ్ యొక్క గురుభక్తికి మెచ్చి ఆ శ్రీహరి సేవకులవలె నీటి కడవలు మోసారు).అట్టి యోగ్యత,పరమాత్మ వద్ద చనువు,ఆయనపై హక్కు పొందిన సత్పురుషులు నిజంగా సచ్చిదానంద పరమాత్మను శాసించేవారే కదా! ఇలా సత్పురుషుల గురించి ఇంకా ఇంకా అధికంగా చెప్పనవసరం లేదు.

## యోగీశ్వరుడు

ఓ సాయినాధా ! సద్గురుమౌళీ ! షిరిడీపురాధీసా ! ఇన్ని మాటలెందుకు? మీరే నా తల్లి,తండ్రి,నా స్వర్వస్వం మీరే.ఓ సాయిశా ! అగణిత లీలావిలాసా!నిజానికి నీ లీలల పరమార్ధాన్ని ఎవరు గ్రహించ గలరు ?పామరుణ్ణి అయిన నేను మాటలకందని నీ లీలలనేవిధంగా వర్ణించగలను ? జీవులనుద్ధరించడానికే మీరు షిరిడీలో అవతరించారు. ప్రమిదలలో నూనెకు బదులుగా నీరుపోసి  దీపాలు వెలిగించారు.తామస జనుల అజ్ఞ్యానాంధకారాన్ని పాలద్రోలారు. ఓ సాయి!శేషసాయీ! మూరెడు వెడల్పున్న బల్లచెక్కను ఎత్తులో వ్రేలాడదీసి దానిపై నిద్రించారు.నిరుపమానమైన మీ యోగశక్తిని ఎరుక పరచి, భక్తజనులను సంభ్రమాశ్చర్యాలకు  గురిచేసారు.

## ఆశ్రితవత్సలుడు

నీ ఆశీర్వచన ప్రభావంతో ఎందరో గొడ్రాళ్ళు సంతానవంతులయ్యారు.మీరు ఎందరో రోగుల వ్యాధులను ఊదీతో నిర్మూలించారు.ప్రభూ! మా ఐహిక బాధలను తొలగించడం మీకసాధ్యం కాదు.గజరాజుకు చిట్టి చీమ బరువౌతుందా?ఓ సద్గురురాయా ! ఈ దీనుని కరుణించు.దీనబంధూ! నీవే దిక్కని నమ్మి వినమ్రంగా నీ పాదాలనాశ్రయించిన నన్ను అలక్ష్యం చేయకు.ప్రభూ!నీవు రాజాధిరాజువి.ధనికుల్లో కుభేరుడివి.
వైద్యులలో ధన్వంతరివి. ఈ జగతిలో నీకు నీవే సాటి.

## సాయినాథా పూజ

సాయిదేవా! ఇతర దేవతల పూజకు ఎన్నో పూజాద్రవ్యాలున్నాయి.ఎన్నెన్నో పూజా విధానాలున్నాయి.కాని, ఈ లోకంలో నిన్ను పూజించడానికి తగిన వస్తువే లేదు ! ( ప్రతి వస్తువులోనూ నీ అంశ కనిపిస్తుంటే,నిన్ను దేనితో పూజించగలను ! ఎలా పూజించగాలను?). సూర్యభగవానుడు తన రాజ్యంలో దీపావళి పండుగ ఎలా జరుపుకుంటాడు? ఏ కాంతి ద్రవ్యాలతో జరుపుకుంటాడు? సాగరుడికి దాహం వేస్తే , ఆయన దప్పిక తీర్చగల నీరు భూమిపై లభిస్తుందా ? అగ్నిహోత్రుడికి చలివేసి వేడి కావాలంటే నిప్పు ఎక్కణ్ణుంచి తేగలం? ఓ సాయీ!సమర్ధ సద్గురూ ! పూజాసామాగ్రి అంతా నీ అంశతోనే నిండివుండెను.మొదటనుంచి అవి నీలోని భాగమే.ఈ నిజం నీకు తెలియదా!

సాయీ! నేను తత్వదృష్టితో ఏవేవో వేదాంత విషయాలు ఊరికే చెబుతున్నాను.కాని నిజానికి నా మనసుకంతటి దివ్యానుభూతి కలగలేదు.అందుచేత నేను అనుభవ జ్ఞానం లేకుండా పలికే ఈ నిస్సారమైన మాటలన్నీ నిరర్ధకం.ఓ గురుసార్వభౌమా! మీతో సన్నిహితత్వాన్ని పెంచుకోవాలని మిమ్మల్ని వ్యవహారిక రీతిలో అర్చిస్తున్నాను. యదార్ధానికి నాకు ఆ సామర్ధ్యం కూడా లేదని నేనెరుగుదును.అందువలన అనేక రూపకల్పనలతో మిమ్మల్ని పూజిస్తున్నాను.కృపానిధీ! దయతో ఈ దాసుని పూజలు,స్వీకరించి , ఆత్మార్పణ శక్తిని ప్రసాదించండి.ఓ పరాత్పరా ! ప్రేమాశ్రువులతో మీ పాదాలు కడుగుతున్నాను.మీకు సద్భక్తి అనే చందనం పూయుచున్నాను. బాబా ! శబ్దాలంకారాలు అనే కఫనీని మీకు వస్త్రంగా సమర్పిస్తున్నాను.ప్రేమభావాలనే కుసుమాలతో కూర్చిన సుమమాలతో మీ గళసీమనలంకరిస్తున్నాను.ఓ పాపభంజనా! నా దుర్గుణాలను,పాప కర్మలను కాల్చి ధూపం వేసి మిమ్మల్నర్చిస్తున్నాను.అవి మలిన పదార్ధాలే ! కాని ,వాటి నుండి దుర్గంధం వెలువడడం లేదు ! సద్గురుని సన్నిధిలో కాక ధూపసామాగ్రిని మరెక్కడ ప్రేల్చినప్పటికీ, ఆయా ద్రవ్యాల సహజవాసనలే వెలువడతాయి. ధూప ద్రవ్యం అగ్నిని స్పృశించగానే దాని సహజ పరిమళం వేదజల్లబడుతుంది.ఇది సహజం.ఓ పతితపావనా ! కాని , మీ సమక్షం

ఇందుకు విరుద్ధం.సహజ వాసనలు అగ్నిలో ఆహుతైపోతాయి . పరిసర ప్రాంతమంతా సుగంధ పరిమళం అక్షయంగా వ్యాపించి,శాశ్వతంగా ఉంటుంది.( అనగా సాయి సన్నిధి లో మన కల్మషాలు దాహించబడి సద్గుణాల పరిమళం మాత్రమే మిగులుతుంది.అంటే పతితులు పావనులౌతారు ). గంగాజలంలో మలినాలను తొలగించగానే గంగానది నిర్మలమై తిరిగి పూర్వపు పవిత్రత సంతరించుకుంటుంది.అలాగే మనసులోని మాలిన్యాలు తోలగగానే ఆత్మ పరిశుద్ధమై ప్రకాశిస్తుంది.

ఓ గురుచంద్రమా!మాయామొహం అనే ధూప దీపాలను వెలిగిస్తున్నాను.ప్రతిఫలంగా నాకు పూర్ణ వైరాగ్యస్థితి ప్రసాదించండి.అచంచల విశ్వాసమనే సింహాసనాన్ని నిండు మనసుతో మీకు ఆసనంగా సమర్పిస్తున్నాను.దయతో దానిపై విరాజమానులై నా భక్తినే నైవేద్యంగా స్వీకరించండి.ఓ సాయి పరాత్పరా ! నా భక్తిని మీకు నైవేద్యంగా సమర్పించాను దానిని ఆరగించి అందలి సారాన్ని తిరిగి నాకు ప్రసాదించండి.నేను మీ పసిబిడ్డను.మాతృ స్తన్యాన్ని గ్రోలడం మీ బిడ్డగా అది నా హక్కు. ( ఇది మానసిక పూజ.ఇందు భక్తుడర్పించేది భక్తి నైవేద్యం.భక్తుడు భగవంతుడినుండి ఆశించే ప్రతిఫలం సంపూర్ణ మానసిక సంతృప్తి ).నా మనసే మీకు దక్షిణగా సమర్పించాను.దయతో స్వీకరించండి.అందుచేత ఇక ముందు నేను చేయబోయే పనులకు నేను కర్తను కాను.పుణ్యశ్లోకా! సాయి సత్ప్రభూ ! వినమ్రుడనై అన్నన్య భక్తీతో కూడిన ప్రార్ధనతో సాష్టాంగప్రణామం చేస్తున్నాను స్వీకరించండి.

## ప్రార్ధనాష్టకం

సాయినాధా! శాంతచిత్తా! అసమాన ప్రజ్ఞాధురీణా ! దయాఘనా ! కరుణాసింధూ! సత్స్వరూపా ! మాయా మోహాంధకార వినాశకా! కుల గోత్రాలకతీతుడవైన ఓ సిద్ధ పురుషా ! ఊహాతీతా ! కరుణావరుణాలయా ! షిరిడీ పురవాసా! ఓ సాయినాధా ప్రభూ! పాహిమాం,పాహిమాం. జ్ఞానభాస్కరా! జ్ఞానప్రదాతా ! సకలశుభదాయీ ! సద్భక్త హృదయవిహారా ! శరణా గత రక్షకా! పాహిమాం. సృష్టికర్తవగు బ్రహ్మదేవుడవు. స్థితికారకుడైన లక్ష్మి వల్లభుడవు.ముల్లోకాలకు లయకారకుడైన రుద్రుడవు కూడా నిశ్చయంగా నీవే.ఓ త్రిమూర్తిస్వరూపా ! సాయినాధా ! నీకు నమస్సులు.

నీవు స్వర్వవ్యాపకుడవు.ఈ సమస్త భూమండలంలో నీవు లేని చోటంటూ ఉందా? నీవు స్వర్వజ్ఞ్యుడవు.సకల జీవ హృదయాంతర నివాసుడవైన ఓ సాయినాధా! నీకు నమస్సులు.ఓ సాయి సమర్ధా ! నా అపరాధాలన్నింటిని మన్నించు. చంచలమనస్కుడను. భక్తీ హినుడనైన నా సందేహాలన్నింటిని శిఘ్రమే నివారించు.ఓ సాయి గురువరేణ్యా! నీవు ధేనువు.నేను నీ లేగను.నీవు చంధ్రుడవు.నేను చంద్రకాంతమణిని. దివిజ గంగా తరంగిణీ తీర్ధ సన్నిభమైన నీ పవిత్ర చరణ కమలాలకు ఈ దాసుని హృదయపూర్విక వందనాలు.సాయీప్రభూ! కరుణతో మీ వరదహస్తాన్ని నా శిరస్సు పైనుంచి నన్ను దీవించండి.మీ దాసుడనైన ఈ దాసగణుని చింతలు,శోకాలు సత్వరమే నివారించండి.

## శరణాగతి ప్రార్ధన

ఓ సాయిదేవా! ఈ ప్రార్ధనాష్టకాన్ని మీకు సమర్పించి మీ మ్రోల సాష్టాంగపడుతున్నాను.నా పాప తాప దైన్యాలను సమూలంగా హరించి నన్నుద్ధరించండి.ఓ సాయి గురువరా ! మీరు గోమాత! నేను మీ లేగా దూడను.మీరు నా ప్రియ జనవి.నేను మీ అనుంగు పసి పాపను.కనుక నాపై కాఠిన్యం చూపకండి. ఓ పతితపావనా ! నీవు మలయగిరియందలి శ్రీచందనవృక్షంలాంటి వాడవు. నేనో .... ముళ్ళ పొదలాంటివాణ్ణి . నీవు జీవనదియైన పవిత్ర గోదావరి జలంవంటివాడవు. నేనో... మహాపాతకుణ్ణి. ఓ గురురాయా! నిన్ను దర్శించగానే నా మనోమాలిన్యాలు దుర్బుద్దులు నశించకపోతే నిన్ను చందనవృక్షంలాంటివాడవని ఎవరంటారు? కస్తూరి సహవాసంతో మన్ను కూడా సుగంధ పరిమళభరితమై దాని విలువ పెరుగుతుంది . పుష్పమాలలోని దారం పుష్పాల సాంగత్యం వల్లనే గదా శిరస్సుపైకెక్కి ఉన్నత స్థానం పొందుతుంది ! మహాత్ములు గ్రహించడంచేత సామాన్య వస్తువులు కూడా వారి మహిమ వల్ల ఉన్నతస్థితిని పొందుతాయి .అదే మహాత్ముల సాంగత్య ఫలితం! నిజానికి భస్మం, కౌపీనం, ఎద్దు (నంది) సామాన్య వస్తువులే! కాని మహేశ్వరుడు గ్రహించడంచేత వాటికి జగద్విఖ్యాతి కలిగింది.గోప గోపికలను రంజింపజేయడానికి శ్రీ కృష్ణ పరమాత్మ యమునా తీరాన బృందావనంలో ఉట్లుకొట్టి, రాసక్రీడా సలిపాడు.

అందుకే గోపకులకు , బృందావనానికి,యమునాతీరానికి ఎంతో ప్రాశస్త్యం,బుధజనుల గుర్తింపు కలిగాయి.

ఓ గురుదేవా!సాయిప్రభూ ! నేను దురాచారుణ్ణే !కాని మీ శరణుజొచ్చాను. నా దురాచారాలను నిర్మూలించమని, నాకు సదా మీ పాదసన్నిధిని ప్రసాదించమని మిమ్మల్ని పదే పదే వేడుకుంటున్నాను. ఓ సద్గురుమౌళీ! సాయిసమర్థా ! సుఖాలనాశించి ఇహలోక పరలోక సంబంధమైన మా కోరికలేవైనా మీరు తప్పక నేరవేర్చెదరని నాకు నిశ్చయంగా తెలుసు.కాని ,గురుదేవా ! నాకు పూర్ణ వైరాగ్య బుద్ధినివ్వండి. చంచలత లేని నిశ్చల మనసునివ్వండి.( ఏ సుఖాలు ఆశించని స్థితి ). బాబా! నా మనస్సు సదా నా ఆధీనం లో వుండేటట్లు గ్రహించు. సముద్రంలోని నీరు తియ్యగా మారితే ,ఇంక ఉప్పు నీరు త్రాగావలసిన అవసరం ఉండదు కదా! సాయిసమర్థా! సముద్ర జలాలను సహితం మధురంగా మార్చగల అపారశక్తిమంతులు మీరు.అందువల్ల మీ దాసుడైన ఈ దాసగణుని ఈ చిరుకోరికను మన్నించండి. ఓ పరంధామా ! పతితపావనా !పావనానఘా! నా దోషాలన్నీ స్వీకరించమని మిమ్మల్ని అర్థిస్తున్నాను . సిద్ధపురుషులలో అగ్రగణ్యులైన మిమ్మల్ని నా దోషాలెంతమాత్రం అంటవు.బాబా! ఇన్ని మాటలెందుకు ? మీరే నా ఆశ్రయం.తల్లి చంకలోనున్న పసిబిడ్డ ఎంతో నిర్భయంగా,ఎంతో సురక్షిత భావంతో ఉండడం సహజమే కదా! నేను కూడా మీ అండ చేరి అలాంటి దివ్యానుభూతినే అనుభవిస్తున్నాను .

## ఫలశృతి

ఓ సాయీప్రభూ ! ఎవరైతే భక్తి ప్రేమలతో ఈ స్తోత్రాన్ని పఠిస్తారో,వారి కోరికలు నెరవేరేలా అనుగ్రహించండి.ఈ '**స్తవన మంజరి**' నిత్యం పారాయణం చేయువారిపై మీ అనుగ్రహం సదా ప్రసరించుగాకా ! ఒక సంవత్సరంలోనే వారి త్రితాపాలు (దైహిక,ఐహిక,మానసిక తాపములు,కష్టాలూ ) కడతేరుగాక ! శుచిర్భూతులైన నిర్మలాంతఃకరణతో,నిశ్చలమైన భక్తి విశ్వాసాలతో ఎల్లరు ప్రతినిత్యం ఈ స్తవన మంజరిని పారాయణం చేసెదరుగాక ! నిత్య పారాయణకు అవకాశం లేకపోతే ,ప్రతి గురువారంరోజున శ్రీ సాయిసద్గురుని దివ్యరూపాన్ని మీ మనసులో ప్రతిష్ఠించి దీనిని

పారాయణం చేయండి .అందుకు కూడా అశక్తులైతే కనీసం ప్రతి ఏకాదశినాడు పటించినప్పటికీ అద్భుతమైన ఫలం పొందగలరు .మహామహిమాన్వితమైన ఈ స్తవన మంజరిని పారాయణం చేసేవారిపై సాయి భగవానుని కృప వర్షిస్తుంది.సాయి పరమాత్మ సత్వరమే వారి ఐహిక పారమార్థిక కోరికలన్నీ నెరవేర్చి అంత్యకాలంలో ఉత్తమగతులు ప్రసాదిస్తారు.దీనిని తరచూ పారాయణం చేసినచో మందబుద్ధుల బుద్ధి వికశిస్తుంది.అల్పాయుష్కులు శతాయుష్కులౌతారు.ఈ స్తవన మంజరి నిత్యపారాయణం వలన నిరుపేదల ఇంట కుబేరుడే నివసిస్తాడు.ఇది సత్యం.....సత్యం......సత్యం.ముమ్మాటికీ సత్యం.ఈ స్తోత్ర పారాయణ వలన సంతానం లేనివారికి సంతానం కలుగుతుంది.రోగులు పూర్ణారోగ్యవంతులౌతారు. దీని నిత్య పారాయణ ఫలం అమోఘం.సకల చింతలు , భయాలు తొలిగిపోతాయి .కీర్తిమంతులై గౌరవమర్యాదలు పొందుతారు .చివరకు అవినాశ పరబ్రహ్మను తెలుసుకుంటారు.

సోదర సాయి భక్తులారా !వివేకవంతులారా ! తర్క వితర్కాలకు , వ్యర్థమైన కల్పనలకు,సంశయాలకు తావివ్వకండి.ఈ మహిమాన్విత స్తోత్ర పఠనం వలన ఒనగూడే సత్ఫలితాలపై పరిపూర్ణ విశ్వాసం కలిగి ఉండండి.క్రమంతప్పకుండ తరచుగా (నెలకో,ఏడాదికో ఒకసారి ) పరమ పావనమైన షిరిడీ క్షేత్రాన్ని దర్శించండి. అనాథనాథుడు,భక్తులపాలిట కల్పవృక్షమైనా సాయినాథుని దివ్యచరణ కమలాలను మీ హృదయంలో స్థిరంగా ప్రతిష్టించింది.

## స్తోత్ర రచన

సాయి సద్గురుని ప్రేరణ వలననే నేనీ స్తవన మంజరిని రచించగలిగాను.లేనిచో నావంటి పామరుడి కింతటి ఉత్కృష్టరచన సాధ్యమా! శక సం 1840 భాద్రపద శుద్ధచతుర్దశి, వినాయక చవితి, సోమవారం మధ్యహ్నం (9-9-1918), పావన నర్మదానదీ తీరాన అహల్యా సన్నిధిలో (అహల్యాదేవి సమాధి వద్ద) ప్రఖ్యాత మహేశ్వరక్షేత్రంలో (ఇండోర్ దగ్గరలో ఒక పుణ్య క్షేత్రం) ఈ ' **సాయినాథా స్తవన మంజరి** ' రచన సంపూర్ణమైంది. శ్రీ సాయిసద్గురుడు నా హృదయంలో ప్రవేశించి ఇందలి ప్రతీ పదాన్ని స్ఫురింపజేసి ఈ స్తవనమంజరి రచన పూర్తి చేయించారు.నా శిష్యుడు దామోదర్ సాయీశుని

అనుగ్రహంతో గ్రంధస్తం చేశాడు.ఈ దాసగణు సాధు సత్పురుషులందరికీ సదా దాసుడు.

ఎల్లరకూ సకల శుభములు ఒనగూడు గాక! ఈ ' శ్రీ సాయినాధా స్తవన మంజరి '
భావసాగరాన్ని తరింపజేసే దివ్యసాధనమై వెలుగొందాలని ఈ దాసగణు ఆ
పాండురంగడుని అత్యంతాదరంతో ప్రార్ధిస్తున్నాడు.శ్రీ పాండురంగా స్వస్తి!

**శ్రీ హరిహరార్పణమస్తు ! శుభం భవతు ! పుండరీక వరద హరివిట్టల**
**సీతాకాంతస్మరణ జయ జయ రామ!**
**పార్వతీపతే హర హర మహాదేవ**
**శ్రీ సద్గురు సాయీనాధ మహారాజ్ కీ జై**
**శ్రీ సద్గురు సాయినాధార్పణమస్తు**
**శుభం భవతు.**



